# ఎదురు చూసిన సమాధానం

మంజుల కూల్ డ్రింక్స్ తెచ్చేసరికి వాళ్ళిద్దరూ ఎందుకో గట్టిగానవ్వుకుంటున్నారు. ఆమె ట్రే టేబుల్ మీద పెట్టి వెళ్ళబోయింది. శర్మ ఆమెని ఆపుతూ "తొందర ఏమిటి? కాస్సేపు కూర్చో" అన్నాడు.

"లోపల చాలా పని ఉంది" అంది మంజుల తప్పించుకోటానికి ప్రయత్నిస్తూ.

"ఉంటనీ. నేను సాయం చేస్తానుగా!" అన్నాడు శర్మ.

అతనితో వాదించటం ఇష్టంలేక మంజుల కూర్చుంది. దాశరథి ఆమెని పట్టిపట్టి చూస్తున్నాడు. ఆ సంగతి మరొకసారి ఆమె గమనించింది. కూల్ డ్రింక్ బదులు ఏ పకోడీలో చేసి ఉంటే మరికొంత ఆలశ్యంగా తానిక్కడికి రాగలిగి ఉండేది. కాని దాశరథి కూల్‌డ్రింక్ తాగి సెలవు తీసుకుంటాడేమోనన్న ఆశ ఆమెనలాగ చెయ్యనీయ లేదు.

"దాశరథిగారు తన పెళ్ళి చూపుల అనుభవాలు చెప్తున్నారు!" అన్నాడు శర్మ ఏదో

తలుచుకుని నవ్వుతూ.

అతనికి ఆ రంగంలో చాలా అనుభవం ఉంది. ఎంత మందిని చూసి చూసి బేరాలు పెట్టి, సంబంధాలు తిరస్కరించాడో ననుకుంది మంజుల. ఆ మాటే అందామని అనుకుంది. కాని అనవసరంగా కటుత్వం చూపడం ఆమెకి నచ్చదు.

"అలాగా!" అంది చిరునవ్వుతో

"అవును. ఆయనకి గొప్ప ఇమేజినేషన్ ఉంది. కథలూ అవీ రాయాల్సిన మాట".

మంజుల తల ఊపి మంచి నీళ్ల గ్లాసు తీసుకుంది. దాశరథి చూపులు ఈ రెండేళ్ళలోనూ ఏమీ మారలేదు.

తనని చూడడానికి అతన్ని ఒక పెళ్ళిళ్ళ పేరయ్య తీసుకొచ్చాడు. "పిల్లవాడు గవర్నమెంటు బేంకులో ఆఫీసరు! ఆస్తులు ఉన్నాయి. తల్లీ తండ్రీ ఉన్నారు. అతనికి ఇద్దరు చెల్లెళ్ళు. మంచి కుటుంబం" అంటూ అమ్మనీ నాన్ననీ ఆశపెట్టేడు. కట్న కానుకలని గురించి అడిగిన ఆ ఇద్దరి ప్రశ్నలకీ "దురాశ ఉన్న మనుషులు లాగలేరు. మీరే చూస్తారుగా!" అన్నాడు.

తాను ఎమ్మే పాసయిందనీ బి.ఏ. వాడు తన గౌరవానికి తక్కువ అనీ మంజుల అనుకోలేదు. నిజానికి నిరుద్యోగి అయిన తన కన్న ఉద్యోగి అయిన అతను ఆర్జించిన డిగ్రీకే ఎక్కువ విలువ ఉంది అనికూడా అనుకుంది. నిజంగానే దురాశ లేకపోతేనూ అమ్మా నాన్నా ఇవ్వగలిగింది పుచ్చుకుని సంతృప్తి పడితేనూ అతను అందంగా లేకపోయినా సరే ఆపాటి ఈపాటి నల్లగా ఉన్నా సరే తాను తల వొంచేద్దామనుకుంది. తాను ఏదో ఉద్యోగం సంపాదిస్తే సంసారం సుఖంగా సాగిపోతుంది. శేషజీవితం అమ్మానాన్నా హాయిగా గడుపుతారు. అంతకన్న ఆమెకి పెద్ద కోరికలేవీ లేవు.

పెళ్లి చూపులకి వొచ్చిన దాశరథి తాను రాగానే పట్టి పట్టి చూశాడు. కళ్లు తిప్పకుండా రెప్పవాల్చకుండా చూశాడు. తానూ అతన్ని గమనించింది. అతను అందగాడు అనడానికి ఎవరూ సాహసించరు. కాని అతనంతగా చూస్తొంటే తనకి ఇబ్బందిగా ఉంటూ ఏదో అసంతృప్తి కలిగింది. కాలేజీలో తనని అలా చూసేవాళ్లు కొందరు ఉంటూనే ఉండేవారు ఆ పరిస్థితి తనకి కొత్తకాదు. కాని ఇక్కడ పరిస్థితులు వేరు.

పెద్దవాళ్ళు కూడబలుక్కుని ఏర్పాటుచేసిన ఏకాంతంలో దాశరథి చాలా ప్రశ్నలు వేశాడు. సమారుగా అన్ని ప్రశ్నలూ తన స్నేహితుల్ని గురించే. బి.ఏ లో తనకి ఎవరు

సన్నిహితంగా ఉండేవారు? ఎమ్మెలో ఎవరు? పార్టీలకీ, ప్రోగ్రాములకీ వెళ్లేవారా? సినిమాలకీ వెళ్లేవారా? పిక్నిక్‌లకి?

ఇలాగ అడిగాడు. తాను అందరితోనూ ఉండవలసినంత ఫ్రీగానే ఉండేది. తాను దాచవలసినది కాని చెప్పకూడనిది కాని తన ప్రవర్తనలో ఏమీ లేదు. దాశరథి అడిగిన వాటన్నిటికీ ఓర్పుతో జవాబులు చెప్పింది.

"కాలేజీలో మీరెవరినైనా....."

"ఏమిటి?"

"అదే .... అంతకాలం దగ్గర దగ్గరగా ఉంటారు కదా! కలిసి సినిమాలు చూస్తారు గదా మరి....."

చిరునవ్వుతో "నేను ఎవరినీ ప్రేమించలేదులెండి" అంది మంజుల.

"వాళ్లెవరైనా మిమ్మల్ని ప్రేమించారేమో?"

"నాకు తెలీదు - నాతో ఎవరూ ఆ మాట ఎత్తలేదు"

కాని దాశరథి కళ్ళలో ఏదో ప్రశ్న అతని గొంతుకలోకి పూర్తిగా రాలేకపోతోంది. కాని ఆమెకి అర్థం అయింది.

మళ్లీ అతనే అడిగాడు. "పెళ్లి అయ్యాక ఉద్యోగం చేస్తారా?"

"దొరికితే తప్పక చేస్తాను".

స్వగతంగా లాగా "ఇద్దరూ ఉద్యోగాలూ చెయ్యకపోతే గడవదు. కాని.... దాని నష్టాలు దానికి ఉన్నాయి" అన్నాడు దాశరథి.

"అవును..." అంది తాను.

తరువాత దాశరథి వెళ్లిపోయి అరవైవేలు కట్నం ఇచ్చి పెళ్లి తరవాత ఉద్యోగం చెయ్యననే మాట ఇస్తే తాను ఒప్పుకుంటానని కబురు చేశాడు. నాన్న సుమారుగా సరేననబోయే సరికి అమ్మ అడ్డుకుంది. ఉన్న ఆస్తులు అమ్మితే అరవైవేలు సంపాదించ వచ్చును. కాని ఉద్యోగం చెయ్యనివ్వకపోవడం ఆమెకి తన కూతురిమీద ఎవరూ విధింపరాని ఆంక్షలాగ అనిపించింది.

ఆమె మాటలన్నీ విన్నాక నాన్న అలాగే అన్నాడు.

తన ప్రమేయం లేకుండా ఈ సంబంధం తప్పడం మంజులకి రిలీఫ్ ఇచ్చింది. దాశరథి మీద ఎందుకో ఆమెకి సదభిప్రాయం లేదు. భయంతోనే ఆమె పెద్దవాళ్ల నిర్ణయం కోసం ఎదురు చూసింది. వాళ్లు సరేనంటే తాను ఎదిరించి ఉండేది కాదు. ఈనిర్ణయం

జరిగేసరికి నెలరోజులు పట్టింది. ఆ రోజుల్లో రెండు మూడు సార్లు దాశరథి తన ఇంటికి వొచ్చి నాన్నతో అవీ ఇవీ కబుర్లు చెప్పి తనకోసం అడిగేవాడు. తనతో అరగంటో గంటో గడిపేవాడు. అంతసేపూ అతను తనవైపు ఇలాగే గుచ్చి గుచ్చి చూసేవాడు.

"ఎందుకు నిర్ణయంలో ఆలశ్యం చేస్తున్నారు?" అని అడిగేవాడు. "మీ షరతులకి ఖరీదు ఉందికదా! ఏర్పాటు చెయ్య వద్దూ?" అనేది తాను.

"చెయ్యాలనుకోండి. కాని నిర్ణయం చెప్పొచ్చుగా?"

"మా నాన్నని అడగండి"

అక్కడికి ఆమాట మార్చి "మీఫ్రెండ్స్ ఎవరైనా మిమ్మల్ని కలుస్తున్నారా? లేక కాలేజ్ అయిపోయాక మిమ్మల్ని మరిచిపోయారా?" అని అడిగేవాడు.

"ఇద్దరు ముగ్గురు వొస్తూనే ఉంటారు"

"ఏమంటారు?"

"ఏముంది? మామూలే!"

సంబంధం కాదని కబురువేళ్ళేక దాశరథి మళ్లీ రాలేదు. అదొక శుభసూచన అయింది.

మరొక్క నెలలో మంజులకి ఒక మంచి కంపెనీలో ఉద్యోగం దొరికింది. ఆ తరువాత చాలా త్వరగా శర్మతో వివాహం అయిపోయింది. అతనూ అక్కా వొచ్చారు తనని చూడడానికి. తన గురించి చాలా వివరాలు శర్మకి తెలిసినట్టు ఉంది. కాఫీ తాగుతూ "నేను ఇక్కడ మాడరన్ ఫార్మసూటికల్స్‌లో మేనేజరుని..." అన్నాడు.

తాను తల ఊపింది చిరునవ్వుతో. ఆ మనిషి స్ఫురద్రూపిలాగ కనిపిస్తున్నాడు. దేనినీ తాను ఆశించలేకపోతోంది. కాని కోరుకుని వెతుక్కుంటూ వాళ్లే వొచ్చారు.

"ఏమమ్మా మంజులా? మా తమ్ముడు ఎలాగ ఉన్నాడు?" అంది అక్కగారు. ఆమెపేరు భానుమతిట. తరవాత తెలిసింది.

ఏ మంటుంది? తాను చిరునవ్వుతో మౌనం రంగరించింది.

"నచ్చాడటనా."

అమ్మ తనకి సాయం వొచ్చింది.

"మీ తమ్ముడు ఏమంటారో ముందు తెలియందే చిన్నపిల్ల అదేమంటుంది? అంది.

భానుమతి నవ్వుతూ "వాడు ముహూర్తం ఎప్పుడని అడుగుతున్నాడు. మరి నేను

ఇరవై రోజుల్లో స్టేట్స్‌కి తిరిగి వెళ్ళాలి. నాకూ మా ఆయనకీ సెలవు అయిపోతుంది" అంది.

పదిరోజుల్లో పెళ్ళి అయిపోయింది. తనకి మోపెడ్ నేర్పించి ఉద్యోగానికి వెళ్లిరావడానికి స్వతంత్రం ఉండేలాగ చేశాడతను. ఎప్పుడూ నవ్వుతూ ఉండి మనసులో ఏమీ దాచుకోని నిర్మల స్వభావం అతనిది. తన జీవితానికి సరైన భాగస్వామి దొరికాడని ఆమె సంతృప్తి పడింది.

ఆ ఆఫీసులో వరలక్ష్మి టైపిస్టుగా చేరే దాకా ఆమెకి ఏ విధమైన అసంతృప్తి లేనే లేదు.

వరలక్ష్మి ఎవరో కాదు. దాశరథికి భార్య. వాళ్లకి తన పెళ్ళి తరవాత కొద్దికాలంలోనే పెళ్లి అయింది. వరలక్ష్మి చామన ఛాయ అంటే సంతోషించాల్సిన శరీరవర్ణం. మనిషిది చాలా నిండైన విగ్రహం. కాని ఆమె స్వభావం చాలా మంచిది. చూపుకి కనిపించేలాగా కాకుండా ఆమె మాటల్లోనూ ప్రవర్తనల్లోనూ సౌజన్యత స్పష్టంగా కనిపిస్తూ ఉంటుంది. ఆమె ఆఫీసులో చేరిన రోజున తాను వెళ్లలేదు. శర్మతో కలిసి తిరుపతి వెళ్లి ఆ తరవాత తిరిగి వొచ్చింది. రాగానే మొదట వరలక్ష్మిని చూసి భయపడింది. తానుకాక ఆ ఆఫీసులో ఒక మహిళ మాత్రమే ఉండేది. ఆమె అక్కడి మేనేజరుకి సెక్రెటరీ కావడాన్ని కలవడానికి తీరిక ఉండేదికాదు. కాని మిగిలిన సహ ఉద్యోగులు చాలా సంస్కృతి ఉన్నవాళ్లు కనక సమయం సరదాగానే గడిచిపోయేది. వరలక్ష్మి ముఖంలో స్నేహశీలత ఏ కోశానా కనిపించలేదు. కాని లంచ్ టైములో ఆమె ప్రవర్తన చూసి మనసు మార్చుకోవాలనే ఆలోచన కలిగింది మంజులకి. మరో పదిరోజుల్లో వరలక్ష్మి మీద చాలా ఇష్టం కలిగింది. అంటే, ఒక విషయంలో తప్ప.

దాశరథి ఆమెని ప్రతిరోజూ స్కూటర్ మీద దింపేవాడు. సీటుదాకా వచ్చి ఆమె కూర్చున్నాక వెళ్లేవాడు. అతను పనిచేస్తున్న బేంకు అక్కడికి చాలా దగ్గిర. తరచుగా లంచ్ టైములో వొచ్చి ఆమెతో లంచ్ తిని తిరిగి వెళ్లి ఆఫీసు మూసే వేళకి వొచ్చి ఆమెని తీసుకుని వెళ్లేవాడు. వరలక్ష్మి మిగిలిన సహోద్యోగులతో వీలైనంత తక్కువగా మాటలాడేది. మంజులతో మాత్రం అవసరమైనంత దగ్గరగా వొచ్చేది.

ఆ విధంగా దాశరథి సుమారుగా ప్రతిరోజూ ఆమెకి కనిపిస్తూనే ఉన్నా దూరం నించే చెప్పే హల్లో కన్నా అతను సాన్నిహిత్యానికి ఎప్పుడూ ప్రయత్నించలేదు. అతని కళ్లు వరలక్ష్మి మీద ఆమెకి దగ్గరగా కూర్చునే ఉద్యోగుల మీదా ఉండేవి. మంజుల త్వరగానే ఆ పరిస్థితికి అలవాటుపడిపోయింది. కాని దాశరథి మరీ అలాగ ఆమెని అంటి పెట్టుకుని

ఉండడం ఆమెకి మొదట ఏవగింపుగానూ క్రమక్రమంగా వాళ్లిద్దరిమీదా జాలిగానూ మారింది. అవన్నీ మనసులోనే ఉంచుకునేది. ఒకటి రెండు సార్లు శర్మకి మాత్రం చెప్పింది.

ఒకసారి వరలక్ష్మి ఆఫీసుకి అరగంట ఆలస్యంగా వొచ్చింది. అక్కడ ఎవరూ ఆలశ్యంగా రావడానికి వీలులేదు. మామూలుగా తన పని చాలా బాగా చేస్తుందని మంచి పేరు తెచ్చుకుంది వరలక్ష్మి. కాని ఆనాడు సూపర్నెంటుగారు ఆమెకి కొంచెం గట్టిగా హితబోధ చేశాడు. మళ్లీ ఆలశ్యంగా వస్తే మెమో ఇస్తానన్నాడు. ఆమెకి కళ్ల నీళ్లపర్యంతమూ అయింది.

టీ బ్రేక్‌లో వరలక్ష్మి పక్కన కూర్చుని టీ త్రాగుతూ మెల్లగా "సారీ! ఈ ఒక్కరోజుకే ఎంతో రాద్ధాంతం చేసేడు! కాని అతనికి కొత్తకాదు." అని ఓదార్చింది మంజుల.

"వాళ్ళ పద్ధతులు వాళ్లవి! ఉద్యోగం అన్నాక తలవొంచక తప్పదు కదా! అందులోనూ నాతప్పు!" అంది వరలక్ష్మి.

"అవుననుకోండి. కాని ఉదయం నించీ అన్నింటికీ తొందరపడి తొమ్మిదిన్నరకి ఆఫీసులో పడడం ఎంతకష్టమో నాకు తెలుసును! ఒక్కోసారి ఈ ఉద్యోగం వొదిలేసి హాయిగా ఇంట్లో కూర్చుందామనిపిస్తుంది" అంది మంజుల సగం నిజంగా.

"నాకూ అలాగే అనిపిస్తుంది. కాని ఆయన ఒప్పుకోరు - ఆ షరతుమీదనే నా పెళ్ళి అయింది" అంది వరలక్ష్మి.

"నిజంగా?"

"అవును....మీకలాంటి బాధ లేదా! ఒకటో తారీఖున చెక్‌పట్టుకెళ్ళి ఇవ్వరా?"

"ఆయన తీసుకోరు. నా అకౌంట్ వేరే...."

"అలాగా!" అంది వరలక్ష్మి. ఆమె కొంచెం ఆశ్చర్యపడినట్టు కనిపించింది కాని ఆమెలో ఈర్ష్య ఏమీ కనిపించలేదు.

"మీరు ఏదో ఒక బండి కొనుక్కుంటే ఈ గొడవ ఉండదు కదా!" అంది మంజుల ఏదో ఆలోచిస్తూ.

"ఆయన వొప్పుకోరు..."

"మీకు జరగరానిది జరుగుతుందని భయమా?"

"అవును. ఇవేళ ఆయన కోసం ఎవరో చాలా పెద్దమనిషి వొచ్చాడు. ఒకపట్టాన్న వదల్లేదు. బస్‌లోనో ఆటోలోనో వెడతానన్నాను. ఆయన వీల్లేదన్నారు."

"ఏం?" అంది మంజుల

"అది ఆయన మనస్తత్వం. అంతే!" అంది వరలక్ష్మి ఆ రోజున మొదటిసారి నవ్వుతూ.

మంజుల ఆమె పరిస్థితిని తన పరిస్థితితో పోల్చి చూసుకుంది. తను అన్ని విషయాలలోనూ ఎంతనయం! అనుకుంది. శర్మ ఈనాటిదాకా తన ఆఫీసులో కాలు పెట్టలేదు. అక్కడ పనిచేస్తున్న వారెవరూ అతన్ని చూడలేదు - చూడబోరుకూడాను. ఒకటి రెండుసార్లు వర్షంలో తడిసి వెళ్ళినప్పుడు మాత్రం అతను వొచ్చి తనని కారులో తీసుకుని వెడితే బాగుండునని అనుకుంది. పూర్తిగా తడిసి ముద్ద అయి ఇంటికి చేరేసరికి ఆమెకి ఈ ఉద్యోగం మీద నిజంగానే విరక్తి పుట్టింది. శర్మ ఇంటికి రాగానే ఆమె పరిస్థితి చూసి "తడిసి వొచ్చావా? టేక్సీలో రాకూడదూ?" అన్నాడు.

మంజుల ప్రస్తుతానికి వొచ్చింది. అంతే.

వాళ్ళ సంభాషణ శబ్దాలే వినిపిస్తున్నాయిగాని ఆమె వాటిని అర్థం చేసుకోలేదు. వాళ్ళిద్దరికీ పరిచయం అయాక దాశరథి చా... అరుదుగానే శర్మ ఇంటికి వొస్తూంటాడు. కొంచెం సేపు కబుర్లు చెప్పి వెళ్ళిపోతూ ఉంటాడు. శర్మ అతనికేదో సహాయం చేశాడనీ ఇంకా ఏదో చేస్తాడనీ మంజులకీ బోధపడింది. కాని వివరాలు శర్మ చెప్పనూ లేదు ఆమె అడగనూ లేదు. రోజూ కన్న దాశరథి ఈ రోజు ఎక్కువ సేపే కూర్చున్నాడు. ఇంట్లో వరలక్ష్మిని అంతసేపు వొంటరిగా వదిలేయడం ఆమెకి ఆశ్చర్యంగానే ఉంది.

ఫోను రింగయితే ఎత్తి మాట్లాడి శర్మ "నేను అర్జెంటుగా బయటికి వెళ్ళాలి ఒకరిని కలుసుకోవాలి." అంటూ లేచాడు. తానూవెడతానని దాశరథి కూడా లేచాడు.

"మీరు కూర్చోండి. తొందర ఏమిటి? మంజుకి ఈ సెలవురోజుకూడా. కంపెనీ ఉండకపోతే మరీ అవిడకి బోరుకొడుతుంది" అన్నాడు. త్వరగా బట్టలు మార్చుకుని వెళ్ళిపోయాడు.

మంజులకి ఇబ్బందిగా ఉంది. దాశరథికీ తనకీ మధ్య చిన్న చరిత్ర మాత్రం ఉంది. అది సంభాషణకి పనికి రాదు. వేరే విషయాలు లేవు. కనీసం ఇతనైనా లేచి కదలొచ్చునుకదా! అనుకుంది.

రెండు నిమిషాలు మాట్లాకుండా కూర్చుని "మీరు ఆఫీసువారితో ఊటీ వెడుతున్నారా?" అన్నాడు.

"అవును."

"శర్మగారు ఒప్పుకున్నారా?"

"ఆయనతో ఇంకా చెప్పలేదు-"

"చెప్తే ....ఒప్పుకుంటారా?"

"తప్పకుండాను!"

'మీకు అదెలాగో ఉండదా.... వరలక్ష్మికి అలాగ వెళ్ళడం ఏమీ బాగుండదు..."

"మూడు రోజులేగా" అంది మంజుల.

"ఆమె వెడతానని అనలేదు!"

"అంటే - ఒప్పుకుంటారా?"

"ఆమె అనదులెండి!"

అదీ నిజమేననిపించింది మంజులకి. నిన్న సర్క్యులర్ రాగానే మరో ఆలోచన లేకుండా 'నో' అని వరలక్ష్మి 'యస్' అని తానూ రాసేశారు. శర్మతో చెప్పాలను కుంటూనే తాను మరిచిపోయింది. తనకి ఊటీ అంటే సరదా. అంతకన్నా సరదా ఓసారి స్నేహితులతో తిరిగి రావాలని.

"నేను వెడతానండీ!" అంటూ లేచాడు దాశరథి.

"వరలక్ష్మి వొంటరిగాఇంట్లో ఉందనా?"

"కాదు. వాళ్ల పిన్నిగారు ఇక్కడే ఉన్నారులెండి....మళ్లీ ఎప్పుడైనా కనిపిస్తాను"

అతను లేచి వెళ్లిపోయాడు.

భలే అనుమానం మనిషి! అనుకుంది మంజుల. ఆ మాట దాచాలని కూడా ప్రయత్నం చెయ్యడు. కాని వరలక్ష్మిని మాత్రం ఉద్యోగానికి వెళ్లనిస్తున్నాడు! అది షరతుట. అతను పెట్టినది.

విచిత్రం మనిషి! అనుకుంది.

తలుపులు వేసి స్నానం చేసి బట్టలు మార్చుకున్నాక ఆమె కొంత తేలిక పడింది. ఊటీ ట్రిప్ మాట శర్మకి చెప్పాలి అనుకుంది. వెంటనే వరలక్ష్మి జ్ఞాపకం వొచ్చి కొంచెం బాధపడింది. వరలక్ష్మి ఎందుకు కాదందో ఆమెకి తెలుసును. ఆమెని అహోరాత్రాలు కంటికి రెప్పలాగ కాసుకునే ఉండే దాశరథి ఆమెని అంతమందిమగాళ్లతో మూడు రోజులు బయటికి వెళ్లనిస్తాడా? శర్మకీ అతనికీ ఎంత తేడా!

బయట లాన్‌లో కూర్చుని తనజీవితం అంతా క్లుప్తంగానే అయినా తీరిగ్గా నెమరు వేసుకుంటూ గడిపింది మంజుల. కాలేజీలో తన అందం గురించి కబుర్లూ కామెంట్లూ ఎక్కువగానే ఉండేవి. కాని కథల్లో జరిగినట్లు ఎవ్వరూ నువ్వంటే నాకు ప్రేమ అని రాలేదు. ఎందుకనో!

ఒకవేళవొచ్చి ఉంటే తానేం చేసేది?

ఒక విధంగా శర్మ అలాగే అనకపోయినా ఆ మాటలే వ్యక్తం చేసి తనని పెళ్లి చేసుకున్నాడు.

పొరపాటున దాశరథి ఆ రోజుల్లోనే సరే అని ఉంటే తాను ఏమయిపోయి ఉండేది? వరలక్ష్మి స్థానంలో తాను...

వరలక్ష్మికి ఏమయింది?

ఆమె తన జీవితం విషయంలో ఎన్నడూ అసంతృప్తి వ్యక్తం చెయ్యలేదు.

ఇలాగ తీరుబాటుగా కూర్చుని ఆలోచిస్తూంటే స్పష్టంగా తెలుస్తోంది - వరలక్ష్మికి అసంతృప్తిలేనే లేదు - సరికదా ఒక గర్వం.

అవును.

అప్పుడూ అప్పుడూ ఆమె కళ్లలో ఒకగర్వం కనిపిస్తూ ఉంటుంది. ఆమె అందంగా లేకపోవచ్చును. కాని అతని కళ్లకి రంభ. ఆమెకి సంతృప్తి ఉంది.

తనకీ ఉందా?

ఇప్పటిదాకా ఈ ఆలోచన రాక ముందు తనకీ సంతృప్తిగానే ఉంది. కాని ఇలా ఆలోచిస్తూంటే ఏదో అసంతృప్తి.

ఆ దిక్కుగా ఎక్కువ ఆలోచించాలనిపించలేదు మంజులకి. వాచీ చూసుకుంది. శర్మ వెళ్లిపోయి రెండు గంటలు అయింది. ఇంక వొస్తూ ఉండాలి.

త్వరగా వొస్తే బాగుండును.

అతను రాగానే ఊటీ గురించి అతన్ని ఒక ప్రశ్న అడగాలి - దానికి తాను ఆశించినదీ ఎదురు చూసినదీ సమాధానం వస్తే తనకి ఎంత ఆనందంగా ఉంటుంది!

కొంచెం సేపు మంజుల ఉన్నతమైన పర్వతాలని గురించీ అందమైన పువ్వులని గురించీ పెద్దపెద్ద అడవులని గురించీ ఆలోచనలు పెట్టుకుంది. ఈసాయం కాలపు వెచ్చదనంలో ఈ పట్నం గుండెల్లో కూర్చుని తాను ఊహించుకున్నవన్నీ చాలా బాగున్నాయి.

చీకటి పడుతోంటే శర్మ వొచ్చాడు.

"ఒంటరిగా కూర్చుని బోరు కొట్టిందా?" అన్నాడు.

"లేదు!"

"గుడ్! అరగంటలో కావాల్సిన పనికి మూడుగంటలు పట్టింది! - కూర్చో నేను స్నానం చేసి వొస్తాను".

"వొద్దులెండి. వంట మొదలుపెట్టాలి!"

"నో! ఈ వేళ మనం తాజ్‌కి డిన్నర్‌కి పోదాం"

శర్మ ఇరవైనిమిషాల తరువాత వొచ్చాడు. కుర్తా పైజామాలో బాగున్నాడు మనిషి. తనవాడు!

ఆమెకి ఎదురుగా కుర్చీలో కూర్చొని "ఏమిటి చాలా తీవ్రంగా ఆలోచిస్తున్నావు! మీ వాళ్ల మీద మనసు పోయిందా?" అన్నాడు.

"లేదు...."

"మరి?"

"ఒక మాట మీతో చెప్పడం మరిచిపోయాను".

"ఏమిటది?"

"మా కంపెనీ వాళ్లందరూ ఊటీకి ట్రిప్ పెట్టేరు...."

"ఎప్పుడు?"

"వొచ్చే శుక్రవారం...తిరిగి సోమవారం వొస్తారు"

"గుడ్"

"నేనూ వెళ్లేదా?"

మంజుల ఊపిరి నిలుపుకుని అతడి జవాబు కోసం ఎదురు చూసింది. తాను అనుకున్న జవాబు - ఆశించిన జవాబు కోసం.

శర్మ ఒక్కనిమిషం ఆలోచనలో పడ్డాడు.

ఆమెకి ఉత్సుకతా ఆశా ఎక్కువ అయ్యాయి.

చివరికి "ష్యూర్!" అన్నాడు.

"అంటే?"

"వెళ్లు మంజులా! పై వారం మా ఎమ్.డీ వొస్తాడు. కాని నువ్వెళ్లేలోపునే అతనికి డిన్నరిచ్చేద్దాం. సరదాగా ఎంజాయ్ చేసిరా!"

మంజుల నిట్టూర్చింది.

చాలా సేపు ఆమె మాటలాడ లేదు.

"ఏమిటి అంత ఆలోచనలో పడ్డావు?" అన్నాడు శర్మ చిరునవ్వుతో ఆమె భుజం మీద చెయ్యివేస్తూ.

"ఏమిలేదు. ఏమీలేదు!" అంది మంజుల. వరలక్ష్మి మీద తనకి ఈర్ష్య అని ఎలాగ చెప్పగలదు?

జీవితంలో అన్నీ మాటల్లో పెట్టలేం.

"ఏమీలేదు" అని మరొసారి గొణిగి ఆశా నిరాశా కలిసిన ఒక చూపుతో అతన్ని పరికించింది. అంతే!